# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో టిడ్కో గృహాల నిర్మాణం 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు.

- ❖ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

- ❖ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్నామని ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ వెల్లడించారు.

- ❖ ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు.

- ❖ వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

రాష్ట్రంలో టిడ్కో గృహాల నిర్మాణం 2026 మార్చి నాటికి పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. కర్నూలు పర్యటనలో భాగంగా స్థానిక పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... 2014లో ఏడు లక్షల టిడ్కో గృహాలను మంజూరు చేశామని చెప్పారు. 2019 లోగా అందులో 4 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్దిదారులకు అందించామని వివరించారు. మిగిలిన వాటిని రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందేందుకు తెలుగు వారంతా కృషి చేయాలని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కోరారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చదువుతో పాటుగా ఉద్యోగ అవకాశాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. జీవన విధానంలో మాతృభాష ఆయువు పట్టు వంటిదని ఆయన పేర్కొన్నారు. తెలుగు సంప్రదాయాలను పునరుజ్జీవం చేయాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

==========================

దేశంలో 70 శాతం ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాటలో నడిపించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆయా పథకాలు గ్రామీణులకు సవ్యంగా అందించాల్సి ఉందని అన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు కూడా పూర్తిగా సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలియజేశారు. విజయవాడలోని విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ రోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గవర్నర్ విశ్వవిద్యాలయ కులపతి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరుగుతుందన్నారు. 27వ స్నాతకోత్సవానికి 53 మంది విద్యార్ధులకు, 28వ స్నాతకోత్సవానికి 67 మంది విద్యార్ధులకు స్వర్ణ, రజత పతకాలను అందించనున్నామని పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

==========================

లబ్ధిదారులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తో కలిసి మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... స్మార్ట్ రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించామని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు.

==========================

శ్రీకాకుళం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుపై ఈ రోజు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో 197 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

==========================

ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు వెంటనే ఎరువులు సరఫరా చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల నిల్వల వివరాలతో మండల వ్యవసాయాధికారులు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఎరువుల సరఫరా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా జరగాలని ఆయన కోరారు. అలాగే ఎక్కడైనా అధిక మొత్తాదులో ఎరువుల పంపిణీ చేసిన సంఘటనలను గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

===========================

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా రేపు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుంచి ఎల్లుండి తెల్లవారుజామున 3 గంటల వరకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం మూసివేయనున్నట్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఒక ప్రకటనలో తెలిపింది. ఎల్లుండి తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతంతో ఆలయం తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తామని పేర్కొంది. చంద్రగ్రహణం కారణంగా రేపు ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేసినట్లుగా వెల్లడించింది. అదే విధంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు ఉప ఆలయాలన్నింటినీ చంద్రగ్రహణం సందర్భంగా రేపు మూసివేయడం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

===========================

'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లాలోని గరుగుబిల్లి మండలంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఈ రోజు ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. పిల్లలకు తమ శరీరంపై హక్కు ఉందని, ఎవరూ వారి అనుమతి లేకుండా తాకకూడదనే విషయాన్ని ఆడ పిల్లలు గ్రహించాలని సూచించారు.

===========================

సమాజంలోని రుగ్మతలకు సరైన పరిష్కారాలను చూపించే విషయంలో లఘు చిత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో అంతర్జాతీయ లఘు చిత్రాల ప్రదర్శనను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... లఘు చిత్రాల ప్రదర్శనను పాలకొల్లులో నిర్వహించడాన్ని స్వాగతించారు. కళలకు, కళాకారులకు పాలకొల్లు పుట్టినిల్లు అని ఆయన అభివర్ణించారు.

===========================

వాయువ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాలలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కూరుస్తాయని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ అధికారి ఎం.వెంకటరావు తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================
===========================